
ప్రజాశక్తి

శుక్రవారం 11 ఏప్రిల్ 2025

5

పార్వతీపురం మన్యం



షార్ట్‌టెర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంకు దరఖాస్తులు ఆహ్వానం

పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమ్మర్ ఆన్ లైన్ షార్ట్‌టెర్మ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం–2025 కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం మొదటి విడత ఈనెల 28న, రెండో విడత మే 12 నుంచి ప్రారంభమౌతుందని తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి చెందిన 3,4 సంవత్సరం సిఎస్‌సి, ఐటి, ఇసిఇ, ఇఇఇ, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఇది రూపొందించినట్టు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు https://naipunyam.ap.gov.in/user-registration వెబ్ సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని వివరించారు. మరిన్ని వివరాలకు హెల్ప్ లైన్ నంబర్లు 99888 53335, 87126 55686, 87901 17279, 87901 18349ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇదెక్కడి వికృతి న్యాయం?

- ఏళ్ల క్రితం భర్తలను కోల్పోయిన మహిళలకు మొండిచేయి
- నవంబర్ తర్వాత దరఖాస్తు చేసుకున్న వితంతువులకే పింఛను
- పింఛను కోసం తిరిగి తనువు చాలించిన గిరిజన వృద్ధురాలు
- ప్రభుత్వ వైఖరిపై భగ్గుమంటున్న మహిళలు



పింఛను కోసం తిరిగి తనువు చాలించిన వృద్ధురాలు అన్నపూర్ణ

ప్రజాశక్తి – పార్వతీపురం

తాము కోరుకున్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గంపెడాశతో ఎదురు చూస్తున్న నిరుపేద మహిళలకు గడిచిన ఏడాది కాలంలో తీవ్ర నిరాశే మిగిలింది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపిస్తున్న వికృత న్యాయంపై వితంతు మహిళలు భగ్గుమంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ఏళ్ల క్రితం భర్తలు కోల్పోయిన వితంతు మహిళలకు పింఛను మంజూరు చేయకుండా గత ఏడాది నవంబర్ తర్వాత భర్తలు మరణించిన మహిళలకు మాత్రమే పింఛను మంజూరు చేస్తుండడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 3, 4 సంవత్సరాల క్రితం భర్తలు చనిపోయిన వితంతు మహిళలు జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్నారు. వారంతా గత ప్రభుత్వ హయాంలో, ఇప్పుడున్న ప్రభుత్వం హయాంలోనూ పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా గత ప్రభుత్వ హయాంలో కొంతమంది దరఖాస్తు చేసుకున్న వితంతువులకు పింఛను మంజూరు కాలేదు. ఎన్నికల తర్వాత వచ్చిన కొత్త ప్రభుత్వం తమ దరఖాస్తులను పరిశీలించి వితంతు పింఛన్లు మంజూరు చేస్తుందని గంపెడాశతో ఎదురు చూశారు. వారందరికీ టిడిపి ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోంది. 2024 నవంబర్ తర్వాత భర్తలు మరణించిన మహిళలకు మాత్రమే పింఛన్లను ప్రస్తుత ప్రభుత్వం మంజూరు చేస్తోంది. దీంతో ఏళ్ల క్రితం భర్తలు కోల్పోయిన వితంతు మహిళలకు తీరని అన్యాయం జరుగుతోంది. గత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసినా, ప్రస్తుత ప్రభుత్వం హయాంలో దరఖాస్తు చేసినా వారి అర్హతలను బట్టి అధికారులు వితంతు పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ టిడిపి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం గత ఏడాది నవంబర్ తర్వాత భర్తలు మరణించిన మహిళలకు మాత్రమే పింఛన్లు మంజూరవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదెక్కడి న్యాయమని వితంతు మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయం చుట్టూ తిరుగుతున్నా..



పాచిపెంట మండలం పి.కోనవలస పంచాయతీ శ్యామలగౌరీ పురానికి చెందిన చుక్క కన్నమ్మ (63) భర్త అప్పలనాయుడు మూడేళ్ల క్రితం మరణించాడు. ఆమె కూడా పింఛను మంజూరు చేయాలని సచివాలయం చుట్టూ తిరుగుతోంది. వితంతు పింఛనుకైనా, వృద్ధాప్య పింఛను కైనా ఆమె రెండింటికీ అర్హురాలే. గత ప్రభుత్వం హయాంలో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ ఆమె పింఛను కోసం దరఖాస్తు చేసింది. టిడిపి ప్రభుత్వం లోనైనా తనకు పింఛను మంజూరవుతుందన్న ఆశతో కనిపించిన అధికారులందర్నీ వేడుకొంటోంది. భర్త, కొడుకు మరణించారు. కోడలు బతుకుతెరువు కోసం దూరప్రాంతాలకు వెళిపోయింది. పింఛను మంజూరైతే కాస్త బతుకుతానని భావిస్తున్న చుక్కమ్మకు నిరాశే ఎదురైంది. గత ఏడాది నవంబర్ తర్వాత దరఖాస్తు చేసుకున్న వితంతువులకు మాత్రమే పింఛను మంజూరు చేస్తుండడంతో ఆమె కు కూడా పింఛను అందని ద్రాక్ష లా మారింది.

పింఛను కోసం తిరిగి తనువు చాలించిన వృద్ధురాలు

మండలంలోని కూర్మరాజుపేటకు చెందిన గిరిజన వృద్ధురాలు వంజరాపు అన్నపూర్ణ (62) పింఛను కోసం తిరిగి బుధవారం తనువు చాలించింది. ఆమె భర్త కన్నయ్యకు గత ప్రభుత్వ హయాంలో వృద్ధాప్య పింఛను మంజూరైంది. అయితే ఆయన అనారోగ్యంతో 2023 డిసెంబర్ 6న మరణించాడు. తన భర్త మరణించినందున తనకు పింఛను మంజూరు చేయాలని అన్నపూర్ణ సచివాలయం చుట్టూ తిరిగి దరఖాస్తు చేసింది. ఆమెకు పింఛను మంజూరయ్యేలోగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ఆమెకు పింఛను మంజూరు కాలేదు. భర్త మరణించడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అన్నపూర్ణ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా దరఖాస్తు చేసింది. తన ఆర్థిక ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పింఛను మంజూరు చేయాలని వేడుకొంది. అయినా పింఛను మంజూరు కాకపోవడం, గ్రామంలో ఎవరో చేసిన సాయంతో బతుకు బండి లాగుతున్న గిరిజన వృద్ధురాలు అన్నపూర్ణ గత కొద్దిరోజులుగా ఆకలితో అలమటిస్తూ బుధవారం తనువు చాలించింది. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా తనకు పింఛను మంజూరవుతుందని కాళ్లు అరిగేలా తిరిగి ప్రాణాలు విడిచింది. గత ఏడాది నవంబర్ తర్వాత దరఖాస్తు చేసుకున్న వితంతువులకు మాత్రమే పింఛను మంజూరు చేయాలని టిడిపి ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో ఆమె పింఛనుకు దూరమైంది. ఇలాంటి వితంతు మహిళలు జిల్లా వ్యాప్తంగా వేలాది మంది వున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయినా ప్రభుత్వం వారికి ప్రాధాన్యత ఇవ్వకుండా గడిచిన ఆరు నెలల్లో దరఖాస్తు చేసుకున్న వితంతువులకు మాత్రమే పింఛను మంజూరు చేయడంపై అనేకమంది ఆందోళన చెందుతున్నారు.

నవంబర్ నుంచి పింఛన్ల వెబ్ సైట్ ప్రారంభం

గత ఏడాది నవంబర్ నుంచి పింఛన్లకు సంబంధించిన వెబ్‌సైట్ లాగిన్ ఓపెన్ అయ్యింది. అప్పటి నుంచి వచ్చిన వితంతు పింఛన్ల దరఖాస్తుదారులకే మంజూరవుతున్నాయి. ప్రభుత్వం ఆదేశాల మేరకే పించన్ల మంజూరు జరుగుతోంది. అంతకంటే ముందు దరఖాస్తు చేసుకున్న వితంతువులకు సంబంధించిన వెబ్‌సైట్ లాగిన్ ఓపెన్ చేయలేదు. అది ఓపెన్ కాగానే నవంబర్ కంటే ముందు దరఖాస్తు చేసుకున్న వితంతువులకు కూడా పింఛన్లు మంజూరు జరుగుతుంది.

జి.పార్వతి, ఎంపిడిఒ, సాలూరు

మానవత్వం లేని ప్రభుత్వం

రాష్ట్రంలో ఇప్పుడు మానవత్వం లేని ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సంక్షేమ పథకాలకు పేదలు అర్హులా కాదా అన్నది చూడాలి కానీ ఎప్పుడు దరఖాస్తు చేశారన్నది చూడకూడదు. పింఛను కోసం ఎదురు చూస్తూ ఆకలితో అలమటిస్తూ బుధవారం తనువు చాలించిన గిరిజన వృద్ధురాలు వంజరాపు అన్నపూర్ణ విషయం తెలిసి చాలా బాధపడ్డాను. రాష్ట్రంలో ఇలాంటి వితంతు మహిళలు లక్షల్లో ఉన్నారు. పింఛను కోసం ఎదురు చూస్తున్నారు. కానీ టిడిపి కూటమి ప్రభుత్వం గత ఏడాది నవంబర్ తర్వాత భర్తలు మరణించిన మహిళలకు మాత్రమే పింఛన్లు మంజూరు చేయడం దారుణం. గత ప్రభుత్వ హయాంలో దరఖాస్తు చేసుకున్న వితంతువులకు పింఛను మంజూరు చేయకపోవడం అన్యాయం. ఎన్నికల ముందు టిడిపి కూటమి పార్టీలు ఎన్నో హామీలిచ్చి ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చాయి. ఆ హామీలను అమలు చేయకపోగా నిరుపేద వితంతు మహిళలకు పింఛను మంజూరు చేయకపోవడం దుర్మార్గం. సనాతన ధర్మం గురించి గొప్పలు చెపుతున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లాంటి నాయకుడైనా ఇలాంటి మహిళల పట్ల మానవత్వం చూపాలి.

పి.రాజన్నదొర,
మాజీ డిప్యూటీ సిఎం.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పూలే, అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి – పార్వతీపురం

ఈనెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే, 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయా తేదీల్లో ఉదయం 9గంటలకు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లు సమర్పణ, అనంతరం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి వేదిక, ఇతర ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని గురువారం తన సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేడుకల్లో జిల్లా అధికారులతో పాటు ప్రజలు, లబ్ధిదారులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఇందులో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజిలు వంటి మెగా చెక్కుల పంపిణీ ఉండాలని, వీటిని డిఆర్‌డిఎ, మెప్మా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఆదరణ యూనిట్ల పంపిణీ, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు, యూనిట్లు పంపిణీని ఆయా అధికారులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే గృహ నిర్మాణ సంస్థ, వ్యవసాయ, పశు సంవర్థక, విభిన్న ప్రతిభావంతుల శాఖల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి రోజున ఆయన చరిత్రను తెలియజేసేలా ఛాయాచిత్ర ప్రదర్శనను ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేయాలని, ఈ ప్రదర్శనను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సిపిఒ, డిఐపిఆర్ఒలు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎస్సీ సామాజిక వర్గానికి అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్, హౌసింగ్ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్.రమేష్, జిల్లా బిసి సంక్షేమాధికారి ఇ.అప్పన్న, డీఎల్డీఓ రమేష్ రామన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్నవర్షం

జిల్లాలోని పలు చోట్ల గురువారం సాయంత్రం వర్షం కురిసింది. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో ఈదురు గాలులతో అరగంట పాటు కురిసిన వర్షంతో వేడెక్కిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎండలతో ఉక్కిరిబిక్కి అవుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, ఎస్కె పాడు తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. అలాగే మక్కువ, వీరఘట్టం, పాలకొండ, సాలూరు, సీతంపేట, పార్వతీపురం మండలాల్లోని పలు ప్రాంతాల్లోనూ వర్షం కురిసింది.



జాతీయ నాణ్యతహామీ ప్రమాణ ధ్రువపత్రాలను కలెక్టర్‌కు అందజేస్తున్న వైద్యాధికారులు

జిల్లాకు జాతీయ నాణ్యత హామీ ప్రమాణ సర్టిఫికెట్లు

ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి : కలెక్టర్

ప్రజాశక్తి – పార్వతీపురం

జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు (సబ్ సెంటర్లు)కు గతంలో ఎప్పుడూ లేనివిధంగా 12 జాతీయ నాణ్యత హామీ ప్రమాణ సర్టిఫికెట్స్ వచ్చేలా కృషి చేసిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను, సిబ్బందిని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం అభినందించారు. మార్చిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్‌కు చెందిన కేంద్ర ప్రభుత్వ వైద్య ఉన్నతాధికారులు జిల్లాలోని 15 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో (సబ్ సెంటర్లు) ఉన్న మౌలిక వసతులు, రోగులకు సిబ్బంది అందించే వైద్యసేవల్లో నాణ్యతలతో పాటు మందులు పంపిణీ, టీకాలు వేయడం, గర్భిణీలకు ఆరోగ్య పరిరక్షణ తదితర విభాగాల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గల నేషనల్ హెల్త్ సిస్టం రీసోర్ సెంటర్ (ఎన్ఎస్ఆర్‌సి) పరిశీలనలో 12 సబ్ సెంటర్ల ద్వారా సంతృప్తికరమైన సేవలు అందుతున్నట్లు నేషనల్ హెల్త్ రిసోర్స్ సెంటర్ ఉన్నతాధికారులు గుర్తించారు. ఆయా సబ్ సెంటర్లకు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆధ్వర్యంలో ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘు, జిల్లా టిబి అధికారి డాక్టర్ వినోద్, ఉమ్మడి జిల్లా క్వాలిటీ ఎస్యురెన్స్ అధికారి కె.శ్రీనివాస్, జిల్లా పబ్లిక్ హెల్త్ కన్సల్టెంట్ డాక్టర్ డి.రమణ కుమార్ (రఘు), క్వాలిటీ మోనిటరింగ్ జిల్లా కన్సల్టెంట్ డాక్టర్ మణికంఠ జిల్లా కలెక్టర్‌ను కలిసి జిల్లాకు లభించిన ఎన్కాస్ సర్టిఫికెట్లు గురించి వివరించారు. ఒకేసారి జిల్లాలో 12 సబ్ సెంటర్లకు ఎన్కాస్ సర్టిఫికెట్లు మంజూరు కావడం, ఇందులో గిరిజన ప్రాంతాల్లో గల సబ్ సెంటర్లు ఎక్కువగా ఉండడం పట్ల కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఇందుకు కృషి చేసిన అందరినీ అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజలకు అవసరమైన, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

బియ్యానికి బదులు డబ్బులు పంపిణీ

ఆగ్రహం వ్యక్తం చేసిన కె.పెద్దవలస గిరిజనులు

ప్రజాశక్తి – మక్కువ

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యానికి బదులుగా డబ్బులు పంపిణీ చేసిన ఘటన మండలంలోని మార్కొండపుట్టి జిసిసి డిపో పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబానికి 20 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ తక్కువగా బియ్యం డిపోకు వచ్చాయన్న నెపంతోకిలో 20 రూపాయలు చొప్పున లెక్క కట్టి లబ్ధిదారులకు సేల్స్‌మెన్ నగదు పంపిణీ చేశారు. ఈ విషయం గురువారం స్థానికులు మీడియాకు సమాచారం అందించారు. దీంతో మండలంలోని కె.పెద్దవలస గిరిజన గ్రామంలో గురువారం స్థానిక రచ్చబండ వద్ద సేల్స్‌మేన్ గిరిజనులతో వేలిముద్రలు వేయించి అనంతరం బియ్యానికి బదులు నగదు పంపిణీ చేసినట్లు స్థానిక సర్పంచ్ రాములమ్మ భర్త రాంబాబు విలేకరులకు తెలిపారు. సుమారు 50 కుటుంబాలకు ఇలాగే నగదు పంపిణీ చేశారన్నారు. దీనిపై స్థానికులు ఏం చేయలేక డబ్బులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

సరిపడా స్టాకు రాలేదు : సేల్స్‌మేన్

కె.పెద్దవలసలో గిరిజనులకు బియ్యానికి బదులుగా నగదు పంపిణీ చేసిన విషయంపై స్థానిక సేల్స్‌మేన్ హరిప్రసాద్‌ను విలేకరులు వివరణ కోరగా తమ డిపోకు ఈనెల రావాల్సిన స్టాకు రాలేదని, సుమారు 40 బస్తాల వరకు బియ్యం రావాల్సి ఉందని అన్నారు. ఈ బియ్యం ఊటగెడ్డలో ఉన్నందున కొంతమంది గిరిజనులకు నగదు పంపిణీ చేయాల్సి వచ్చిందన్నారు. వాళ్లు ఎలాగూ వ్యాపారులకు బియ్యం అమ్ముకుంటున్నారు కదా..! డబ్బులు పంపిణీ చేసి వారికి ఇబ్బందులు లేకుండా చేశానని సమాధానం ఇవ్వడం గమనార్హం. బియ్యం స్టాక్ తగ్గుదల మండలంలో ఇలాగే ఉందని, వివరాలు కావాలంటే మా యూనియన్ ప్రెసిడెంట్‌తో మాట్లాడమని ఆయన తెలిపారు



లబ్ధిదారులకు బియ్యానికి బదులు డబ్బులు అందజేస్తున్న సేల్స్‌మేన్ హరిప్రసాద్

ప్రతీ కుటుంబం రూ.లక్ష ఆదాయం పొందాలి : కలెక్టర్

ప్రజాశక్తి – పార్వతీపురం

ప్రతి కుటుంబం కనీసం లక్ష రూపాయలు ఆదాయం పొందాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల నుంచి జీవనోపాధి కల్పనలో భాగంగా సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలు, పశుసంవర్ధక సంబంధిత యూనిట్లు – ఆవుల పెంపకం, మేకల పెంపకం, గొర్రెల పెంపకం, కోళ్లు పెంపకం తదితర యూనిట్ల ఏర్పాటు వల్ల పొందే ఆదాయ మార్గాలపై కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. జిల్లాలో 110 ఎకరాల్లో పనస పంట సాగుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రిజర్వాయర్లు, చెరువుల కింద మూడు నుంచి నాలుగు వేల ఎకరాల వరకు భూమి అందుబాటులో ఉందని వాటిలో ఉపాధి హామీ కింద కొబ్బరి పంటను వేసి గ్రామ ఐక్య సంఘాలకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జిల్లాలో చిరుధాన్యాల పెంపకం సైతం పెద్ద ఎత్తున చేపట్టవచ్చని, వీటికి మంచి ధర వస్తుందని తెలిపారు. రానున్న రబీ కార్యాచరణ ప్రణాళికలో వీటన్నింటికీ చోటు కల్పించి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన సూచించారు.

సమావేశంలో నాబార్డు డిడిఒ డిఎస్ దినేష్ కుమార్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఎం సుధారాణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి బి శ్యామల, జిల్లా సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టు అధికారి వి.రాధాకృష్ణ, జిల్లా అగ్రిట్రేడ్, మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్, ప్రకృతి సిద్ధ మొక్కల అనుభవజ్ఞులు టి.శివకేశవ రావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

పసర వైద్యం వికటించి బాలింత మృతి?

ప్రజాశక్తి– సాలూరు



మృతి చెందిన లక్ష్మి

పాచిపెంట మండలం మోదుగ గ్రామానికి చెందిన గిరిజన బాలింతకు పసర వైద్యం వికటించి మరణించినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం తీసుకొచ్చిన కొద్ది నిమిషాలలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మోదుగ గ్రామానికి చెందిన బాలింత సేబి లక్షి (30) నెలరోజుల క్రితం మూడో బిడ్డకి ఇంటి వద్దే జన్మనిచ్చింది. అయితే అనారోగ్యం కారణంగా కొద్దిరోజుల క్రితం పాచిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఆమెని తీసుకొచ్చి వైద్యం చేయించారు. ఒక రోజు అక్కడ వైద్యం తీసుకున్న తర్వాత ఇంటికి తీసుకెళ్ళారు. తర్వాత పచ్చ కామెర్లు వచ్చిందని గ్రామంలో పసర వైద్యం చేయించినట్లు తెలిసింది. దీంతో ఆమె ఒళ్ళంతా వాపులు రావడం తో బుధవారం ఉదయం 7.40 నిమిషాలకు ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో బెడ్‌మీద లక్ష్మిని వేయగా డాక్టర్ పరీక్షించే లోగానే ఆమె ప్రాణాలు విడిచింది. దీంతో వెంటనే సొంత ఊరికి ఆమె మృతదేహాన్ని తీసుకెళ్ళారు. దీనిపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విఆర్ మీనాక్షిని వివరణ కోరగా మోదుగ గ్రామానికి చెందిన బాలింత సేబి లక్షిని వైద్యం కోసం ఉదయం తీసుకొచ్చారని, బెడ్ మీద వేయగానే ఆమె ప్రాణాలు విడిచిందని చెప్పారు. సెప్టిక్ షాక్ మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఆమె మరణించినట్లు తెలిపారు.

13న మంచిపల్లి సత్యవతి జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం

ప్రజాశక్తి – పార్వతీపురంరూరల్

సాహితీ లహరి, మంచిపల్లి సేవా సంస్థ వారు ప్రతి ఏటా ఇచ్చే శ్రీమతి మంచిపల్లి సత్యవతి జాతీయ ఉగాది పురస్కార ప్రదానోత్సవం ఈనెల 13న స్థానిక సూర్య పీఠం ఆస్థాన మండపంలో జరుగుతుందని సాహితీ లహరి వ్యవస్థాపకులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, బాల సాహిత్య నిలయం వ్యవస్థాపకులు మంచిపల్లి పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లుగా శ్రీమతి మంచిపల్లి సత్యవతి జాతీయ ఉగాది పురస్కారాలు ఇస్తున్నామని శ్రీరాములు తెలిపారు. ఈ పురస్కారాలు గత నాలుగేళ్లుగా వరుసగా బాల సాహిత్యంలో విశేష కృషి చేసినందుకు, బాల సాహిత్యంలో అనేక కథలు, బాల గేయాలు బాల కవితలు రాసి అనేక పుస్తకాలు ప్రచురించి, వారి బాల సాహిత్యాన్ని ప్రతి ఒక్కరికీ చేరి వేసినందుకు గానూ ఈ పురస్కారం అందజేయనున్నారు. పురస్కారానికి ఎంపికైన వారిలో బెహరా ఉమామహేశ్వరరావు (పార్వతీపురం), దార్ల బుజ్జీబాబు (గుంటూరు), అమరావతి నీరజా (హైదరాబాద్), ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి (హైదరాబాద్) ఉన్నారు. వీరితో పాటు వివిధ రంగాల్లో సేవ చేసినందుకు గానూ సేవాశ్రీ పురస్కారాలు ఈ ఏడాది విద్యారంగంలో బి.అగ్నిహోత్రుడు (విశ్రాంత ఉపాధ్యాయులు), వైద్యరంగంలో డాక్టర్ జీరు నగేష్ రెడ్డి, కళా రంగం పల్ల పరిశినాయుడు, సంగీత రంగం జమ్మరాజు, సామాజికరంగం కె.కృష్ణమూర్తికి ఇవ్వనున్నారు. ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు, కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ పురస్కారగ్రహీతలకు పురస్కారాలను ప్రదానం చేస్తారని తెలిపారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించి కవులను సత్కరించనున్నట్టు మంచిపల్లి సేవా సంస్థ డైరెక్టర్లు మంచిపల్లి పార్థసారథి, డాక్టర్ మంచిపల్లి గోపీనాథ్ తెలిపారు.

నమ్మించారు... నడిరోడ్డున పడేశారు

- రహదారి వెడల్పులో ఇల్లు కోల్పోయిన వికలాంగుడు
- ఇంటి వద్ద నిరసన

ప్రజాశక్తి – మక్కువ

రహదారి వెడల్పులో ఇల్లు కోల్పోయిన తనకు ఇంటి స్థలం మంజూరు, కొంత నగదు ఇస్తామని నమ్మించి రెండేళ్లు గడుస్తున్నా ఏ ఒక్కరూ కన్నెత్తి చూడలేదని, తనను నమ్మించి నడిరోడ్డుపై పడేశారని ఓ వికలాంగుడు తాను ఇల్లు కోల్పోయిన వద్దే నిరసన తెలియజేస్తున్న ఘటన మండలంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే మక్కువ – చినబోగిలి రహదారి పనుల్లో వెంకట బైరిపురానికి చెందిన పిట్ట గంగులు అనే వికలాంగుడు తన ఇంటిని పూర్తిగా కోల్పోయాడు. 2023 పనులు ప్రారంభమైన సమయంలో అప్పటి ప్రభుత్వంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తనకు న్యాయం చేస్తానని చెప్పి నమ్మించారని ఆయన వాపోతున్నాడు. ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రుణం కూడా మంజూరు, ఆర్థిక సహాయం కూడా అందిస్తామని నమ్మబలితారని తెలిపాడు. అయితే నేటికి రెండేళ్లు గడుస్తున్నా ఎవరో తనను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదనైన తనకు నిలువ నీడ కరువైందని, దీంతో అద్దె ఇంట్లో ఉంటూ తనకు వచ్చిన పింఛన్ డబ్బుతో కాలం వెళ్లదీస్తున్నానని రోధిస్తున్నాడు. తమ కులదైవాన్ని కూడా మా ఇంటి వద్ద యాదవులమంతా కలిసి పూజించుకునే వాళ్లమని, ఇప్పుడు తనతో పాటు తన దైవానికి కూడా నీడ లేకుండా పోయిందని వాపోతున్నాడు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోయిందని, చేసేది ఏమీ లేక తాను కోల్పోయిన ఇంటి వద్దనే టార్పాన్లు వేసి రహదారిపైనే నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని ఆయన కోరుతున్నాడు.

బలవంతపు తీర్మానాలు సరికాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆదరాబాదరాగా పాఠశాల యాజమాన్య కమిటీలతో బలవంతపు తీర్మానాలు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ స్కూల్ ఏర్పాటు, యుపి పాఠశాలల డౌన్ గ్రేడ్, మోడల్ స్కూల్ ఏర్పాటుపై పాఠశాల యాజమాన్య కమిటీ లతో చర్చించకుండా అభిప్రాయం తీసుకోకుండా ఉపాధ్యాయులతో తీర్మానాలు చేయించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఆ తీర్మానాలు విద్యాశాఖ అధికారులే చేయించుకోవాలని కోరారు.

శరవేగంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీలో గురువారం ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, పంచాయతీ ఇఒ వై.వెంకటనాయుడు ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు వీధుల్లో గల కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి ఉండడంతో మురుగు వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తల చర్యల్లో భాగంగా పలు వీధుల్లో ప్రధాన రహదారి వద్ద గల ఇరువైపులా కాలువల్లో నిండి ఉన్న చెత్తాచెదారాన్ని జెసిబి ద్వారా తొలగించి ప్రజలకు మురుగు వాసన నుంచి విముక్తి కలిగించామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో 'చదువుతో భవిష్యత్తు'

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఆధునిక వసతులతో కూడిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువు వల్ల విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటుతో పాటు ఉజ్వల భవిష్యత్ ఉందని కళాశాల అధ్యాపక బృందం తెలిపింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల పార్వతీపురం అధ్యాపకులు నాలుగు బృందాలుగా ఏర్పడి పలు గ్రామాల్లో అడ్మిషన్ కోసం ఇంటింటికి వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపల్ జె.రామారావు ఆధ్వర్యంలో వెంకంపేట, చిన్న బొండపల్లి ఎంఆర్‌నగరం గ్రామాలలో 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ కళాశాలలో ఉన్న సదుపాయాలు, వాటి ఆవశ్యకత గుర్చి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి కళాశాలలో చేరాలని కోరారు. సీనియర్ అధ్యాపకులే ఉత్తమ బోధన అందిస్తామని, సర్పంచులు, ప్రజాప్రతినిధులను రాజకీయ నాయకులను కలిసి విద్యార్థులని ఇంటర్మీడియట్‌కు ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తెర్లి రవికుమార్, సత్యనారాయణ, కైలాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఫైలేరియా రోగులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న రోగులకు మోరబిడిటి మేనేజ్‌మెంట్ కిట్లను గురువారం పంపిణీ చేశారు. జిల్లా మలేరియా కార్యాలయం నుంచి వచ్చిన ఈ కిట్లను పెదపెంకి గ్రామ ఆరోగ్య మందిర ఆవరణలో ఎంపిపి జి.నాగమణి, జెడ్‌పిటిసి సభ్యులు వై.రవికుమార్, సర్పంచ్ పాపారావు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ క్రాంతి కిరణ్మయి, స్థానిక టిడిపి నాయకులు పెంకి మోహనరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కిట్టులో సబ్బు, టవల్, స్కిన్ అయింట్‌మెంట్, మగ్గు ఉన్నాయి. ఫైలేరియా వ్యాధిగ్రస్తులు పాదైన భాగాన్ని శుభ్రం చేసుకోవాలని వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ పి.ఉమామహేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పిలు సత్యవతి, జ్యోతి, ఎఎన్ఎంలు సరోజిని, గౌరీశ్వరి పాల్గొన్నారు.

చిట్టిపూడి వలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి : వీరఘట్టం

మండలం చిట్టి పూడి వలస గ్రామం లో గురువారం స్థానిక వైద్యాధికారి బి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

నీటికుంటల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురం, తూడి, కత్తులకవిటి, వండువ, నీలానగరం, చిదిమి, తలవరం, నడిమికెళ్ల, కడకెల్ల, నడుకూరు, గడగమ్మ, దశమంతపురం చలివేంద్రి, కంబర విక్రంపురం, చిట్టపూడి వలస, పనస నందివాడ, వీరఘట్టం, తెట్టంగి తదితర గ్రామాల్లో పశువుల దాహార్తి కోసం ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటలు ఏర్పాటు చేయనున్నట్లు ఎపిఒ జి.సత్యనాయుడు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ పొడవు ఐదు మీటర్లు, వెడల్పు రెండున్నర మీటర్లు, అంచనా విలువ రూ.32 వేలతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కంబరలో నీటి కుంటల ఏర్పాటుకు శంకుస్థాపన కూడా చేపట్టినట్లు ఆయన తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా పనులు చేపట్టేందుకు కృషి చేయాలని టెక్నికల్ సహాయకులకు ఆదేశించామని తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని జమ్మిడివలస మాజీ సర్పంచ్ మూడడ్ల సూర్యనారాయణ గురువారం మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైసిపి నాయకులు పరామర్శించారు. దివంగత సూర్యనారాయణ కోడలు సువ్వాడ లావణ్య పార్వతీపురం మున్సిపాలిటీ మూడో వార్డు కౌన్సిలర్ కావడంతో పట్టణానికి చెందిన కౌన్సిలర్ల బృందం కూడా మాజీ ఎమ్మెల్యేతో పాటు పరామర్శించారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - సీతంపేట

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టికా హారం తీసుకోవాలని, అలా తీసు కుంటేనే ఆరోగ్యంగా ఉంటారని సిడిపిఒ పి.రంగలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన సీతంపేట అంగ న్వాడీ కేంద్రం-3లో గురువారం పోషణ పక్వాడ్ వక్షోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిడిపిఒ మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, పిల్లలు, బాలింతల ఆరోగ్యంపై అంగన్‌వాడీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్, అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఎం రాము

అధిక దిగుబడులు సాధించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు అవగా హన కల్పించుకోవాలని, వెలుగు ఎపిఎం కె.రాము రైతులకు సూచించారు. గురువారం మండలంలోని చలివేంద్రి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఐఎఫ్సి క్లస్టర్ (సమగ్ర సుస్థిర వ్యవసాయం) రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న జీవనోపాధితో పాటు ఒక్కొక్క కుటుంబం అదనంగా జీవనోపాదులు పెంపొందించుకోవాలన్నారు. రాష్ట్రంలో 16 ఐఎఫ్సి క్లస్టర్లు మంజూరు కాగా చలివేంద్రి గ్రామాన్ని ఎంపిక చేయడం గర్వకారణమన్నారు. ప్రభుత్వం అన్ని శాఖల రైతులకు అండగా ఉంటుందని జీవన ప్రమాణ స్థాయిని కుటుంబ ఆదాయం పెంపొందించడానికి మంచి అవకాశం కలిగిందని తెలిపారు. ఈ పంచాయతీలో ముందుగా 300 కుటుంబాలతో ప్రతి 100 కుటుంబాలకు ఒక సిఆర్పి చొప్పున పర్యవేక్షణ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి డిపిఎం ఫైనాన్స్ అప్పారావు, జీవనోపాదుల ఎపిఎం భారతి, వ్యవసాయ అధికారి సౌజన్య, ఉద్యానవన శాఖ ఎఒ అమరేశ్వరి, పశుసంవర్ధన శాఖ విఎ వెంకటలక్ష్మి, ఎపి సిఎన్ఎఫ్ మారుతి సింహాచలం, రైతు ఉత్పత్తిదారుల సిసివై ఆనంద్, గ్రామ పెద్దలు సిహెచ్ ఉమామహేశ్వరరావు, శశి కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఊరు బడిని రక్షించుకుందాం

ప్రజాశక్తి - పాచిపెంట

ఊరు బడిని రక్షించుకుందాం... పాఠశాలలను మూసివేయొద్దు అంటూ పాచిపెంటలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఎస్.రామారావు, కె.త్రినాధరావు ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను గురువారం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విద్యా విధానం పేరుతో ఉన్న ప్రభుత్వ పాఠశాలను మూసివేయడం పేదలకు చదువు లేకుండా చేయడమేనని అన్నారు. నూతన విద్యా విధానం వల్ల డ్రాప్స్ పెరిగే ప్రమాదాన్ని ప్రజలకు చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. విజయవంతంగా నడుస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలలను మూసివేసి 3,4,5 తరగతులను తరలించడం సరైంది కాదని అన్నారు. ఈ ప్రభుత్వ విధానాల వల్ల ప్రాథమిక విద్య పూర్తిగా బలహీన పడిపోయే ప్రమాదం ఉందని, ఈ పద్ధతి మార్చుకొని ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలుగు, ఇంగ్లీష్ సమాంత మీడియంలో కొనసాగించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటువంటి నిర్ణయం చేయడం వల్ల పేదలకు విద్య లేకుండా మరింత అనాగరికంగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున పాఠశాలలను మూసివేసే యోచనను ప్రభుత్వం మానుకోవాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పాచిపెంట: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

కొమరాడ : నూతన విద్యా విధానం పేరుతో పాఠశాలలు మూసివేసే ప్రక్రియను కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కుమ్మరిగుంట పంచాయతీ డంగభద్రలో నిర్వహిస్తున్న పాఠశాల వద్ద నుండి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి గురువారం "ఊరు బడిని" రక్షించుకుందాం పేరిట సిపిఎం ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు హెచ్ రామారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్కూళ్లను ఎత్తివేయమని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ఇలాంటి నిర్ణయాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. నూతన విద్యా విధానం వల్ల డ్రాప్ అవుట్స్ పెరిగే ప్రమాదం ఉందన్నారు. దీంతో ప్రాథమిక విద్య పూర్తిగా బలహీనపడే ప్రమాదం ఉందని చెప్పారు. ప్రజలకు అసౌకర్యంగా ఉండే పద్ధతులు మార్చుకొని ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామాల్లోని పాఠశాలలను కాపాడుకునేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపర్చి భవిష్యత్తులో ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డంగభద్రకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని గంగాపురం ఫీడర్ మెయింటెనెన్స్ పనులు కారణంగా శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఇఇ గోపాలరావు నాయుడు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తానవలస, డోకిశీల, గంగాపురం, ములగ, కమిటీ భద్ర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఎటిడబ్ల్యుఒ కార్యాలయంలో ఆడిట్

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేట ట్రైబల్ వెల్ఫేర్ ఎటిడబ్ల్యుఒ కార్యాలయంలో గురువారం ఆడిట్ నిర్వహించారు. విజయవాడ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి సీనియర్ అకౌంట్ అధికారి చంద్రశేఖర్ జూనియర్ ఎకౌంట్ అధికారి రామయ్యలు ఆడిట్ చేశారు. 2014 నుంచి 2019 వరకు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎటిడబ్ల్యుఒ జి.మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో ఉపశమనం

ప్రజాశక్తి- సీతానగరం

అధిక ఉష్ణోగ్రతల కారణంగా వేసవి తాపానికి గురికాకుండా ఆయుర్వేదంతో ఉపశమనం పొందవచ్చని బూర్జ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు ఆసుపత్రిలో పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి తనిఖీలు నిర్వహిస్తూ వేసవి జాగ్రత్తలపై గురువారం ఆమె పలు సూచనలు చేశారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా శరీరం నీటి శాతాన్ని కోల్పోతుందని దీనికి అనుగుణంగా తగు జాగ్రత్తలు తీసుకోని యెడల డీహైడ్రేషన్, వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. వీటికి గురికాకుండా ఆయుర్వేద ఔషదాలు, ఇంటి వద్దే చేసుకోగలిగే కొన్ని ఆయుర్వేద చిట్కాలతో ఉపశమనాన్ని పొందవచ్చని అన్నారు. సబ్జా గింజలు నానబెట్టి నిమ్మరసం కలిపి అందులో కొంచెం చక్కెర వేసి తాగాలన్నారు. మజ్జిగలో జీలకర్ర పొడి చిటికెడు, కొంచెం బ్లాక్ సాల్ట్ వేసి తీసుకోవాలన్నారు. ఉషిరి పొడి చేసి అందులో ధనియాలు పొడి కలిపి కషాయం తీసుకోవాలన్నారు. శతావరి (పిల్లి పీచర) వేళ్ళు పొడి పాలల్లో కలిపి తీసుకున్నా ఉపశమనం కలుగుతుందన్నారు. అతి మధుర ఆరా చెంచా గ్లాసులో కలిపి తాగాలన్నారు. ఉసిరికి పౌడర్‌లో గుంటగలగర ఆకు, పెరుగు కలిపి తలకి పట్టించి గంట తర్వాత స్నానం చేయాలన్నారు. దోసకాయ రసం ముఖం, చర్మంపై పూతగా వేసుకున్నా ఎండకు పొడి బారకుండా ఉంటుందన్నారు. ఆయుర్వేద ఔషదాలు, కషాయాలు ముఖ్యంగా దాన్యక పంచక కషాయం, షధంగపానీయం, ద్రాక్షసవలు, దశమూల కషాయాలు వేసవి తాపాన్ని తగ్గిస్తాయన్నారు. వేసవి కాలంలో వచ్చే చర్మ సంబంధిత వ్యాధులకు ఖాదిరారిస్ట, సోమరాజి, మరిచ్యది తైలాలు, విడంగ చూర్ణం ఉపయోగపడ తాయన్నారు. ఆహారనియమావళి పాటించాలని శాఖాహారం ఎక్కువగా తీసుకోవాలని, తాజా ఆకుకూరలు, కీరదోస, పుచ్చకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, వైద్యుల సూచనలు పాటిస్తూ జాగ్రతలు తీసువాలని డాక్టర్ హేమాక్షి కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పద్మ తదితరులు ఉన్నారు.

వైద్యాధికారి హేమాక్షి


ఎండలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హేమాక్షి

ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఉపాధి హామీ పథకం విజయవంతం అవడంలో కీలకపాత్ర వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఆయన క్యాంపు కార్యాలయంలో ఆ సంఘ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 19 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమ వేతనం కింద రూ.26వేలు అందజేయాలన్నారు. మ్యాన్ డేస్ టార్గెట్‌ను రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కురుపాం: కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్లు స్థానిక ఎంపిడిఒ జె.ఉమా మహేశ్వరికి, ఎపిఒ పి.బావాజికి ఎంపిడిఒ కార్యాల యంలో గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు ఎం.మురళి, శ్రీహరి, మాధవ మాట్లాడుతూ 19ఏళ్లుగా ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్నమని, కానీ నేటికీ తమకు ఎటువంటి ఉద్యోగ భద్రత లేదని, కావున ఇప్పటికైనా కనీస వేతనం రూ.26 ఇస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ ఎఫ్‌టిఇ అమలు చేస్తూ ప్రమాదవ శాత్తూ మరణించిన వారికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600కు పెంచాలని, మేట్లకు గౌరవ వేతనం, ఫోన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండలంలో గల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రాన్నిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా చలపతిరావు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఉన్న లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులుగా శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న డాక్టర్ సిహెచ్ చలపతిరావును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పనిచేసిన కార్యవర్గాలన్నీ లయన్స్ క్లబ్ అభివృద్ధికి ఎంతో కృషి చేయడం సంతోషకరమన్నారు. నూతన కార్యవర్గం కూడా వాళ్లను ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చేయాలన్నారు. లయన్స్ క్లబ్‌కు కార్పొరేట్ నిధులను తీసుకొచ్చేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ చలపతిరావును ఎమ్మెల్యే దుస్సాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షులు చలపతిరావు మాట్లాడుతూ పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, పెద్దల, కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలు, అభిప్రాయాలతో, సమిష్టి కృషితో లయన్స్ క్లబ్‌ను ఉత్తరాంధ్రలోనే ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బి.చంద్రశేఖరరావు(బాబు), డాక్టర్ ద్వారపు రెడ్డి రామ్మోహనరావు, డాక్టర్ యాళ్ళ వివేక్, చుక్క భాస్కరరావు, డాక్టర్ భోగి ఈశ్వరరావు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు బి.ఎన్.బి.రావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ (జయబాబు), పట్టణ ప్రముఖులు టిడిపి నాయకులు, లయన్స్ క్లబ్ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


చలపతిరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

సిసి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో యూనియన్ బ్యాంక్ నుండి గడ్డి కాలనీ వరకు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును గురువారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన చోట సిసి రోడ్ల నిర్మాణాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్‌రావు, ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, టిడిపి అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిడిఒ సాల్మన్‌రాజ్, కూటమి నాయకులు వెంపటాపు భారతమ్మ, చిన్న, రాజేష్, లక్ష్మణరావు, సుబ్బలక్ష్మి, మండల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఉన్న ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి టి.జీవన్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతి అందించారు. ఇల్లు లేని పేదలు ఎంతోమంది ఉన్నారని వారికి సొంత స్థలం లేక ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఉందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సూరయ్య ఉన్నారు.


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఉపాధి బిల్లులు చెల్లించండి

ప్రజాశక్తి - సీతానగరం

బకాయి పడ్డ ఉపాధి బిల్లులు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని నిడగల్లు గ్రామ సచివాలయం వద్ద గురువారం ఉపాధి వేతనదారులతో కలిసి బకాయి బిల్లులు చెల్లించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ గత తొమ్మిది వారాలు వేతనదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా కూలి రాకపోవడంతో జీవనం దైన్యంగా మారిందన్నారు. ఇప్పటికే దొరికనచోట అప్పులు చేశారని, ఇప్పుడు ఆ అప్పులు కూడా ఇచ్చేవారు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలా మండలంలోని 35 పంచాయతీల్లో గల వేతనదారులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే పని ప్రదేశంలో కనీస సదుపాయాలైన తాగునీరు, టెంట్లు, మజ్జిగ, వైద్యం కిట్లు లేవంటున్నారు. తక్షణం సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం నిడగల్లు పంచాయతీ కార్యదర్శికి వినితి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధి వేతనదారులు త్రినాధ, అడవిరాముడు, జానకి, భాస్కరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కూలీలు

పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పెంచిన పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలో గ్యాస్ సిలిండర్లతో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి నేటి వరకు 9సార్లు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచి ప్రజలపై భారాల మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు సగానికి సగం తగ్గిపోయినప్పటికీ రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ఒక ప్రక్క చెబుతూనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచుతుంటే రాష్ట్ర ప్రభుత్వం కనీసం ప్రశ్నించకపోవడం విచారకరమని అన్నారు. పెట్రోలియం ఉత్పత్తులైన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడమంటే ప్రజలు కొనే అన్ని నిత్యవసర సరుకుల ధరలు పరోక్షంగా పెంచడమేనని అన్నారు. ధరలు ఒక వైపు పెంచుతూనే ఆ భారం ప్రజలపై పడదని అబద్దాలు చెప్పడం మరి ఆశ్చర్యంగా ఉందని విమర్శించారు. తక్షణమే పెంచిన పెట్రోలియం ఉత్పత్తులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సింహాద్రి దుర్గారావు, నియోజకవర్గ నాయకులు ఇవి నాయుడు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్, మండల కార్యదర్శి బిటి నాయుడు, యువజన విభాగం నాయకులు ఎస్.కిరణ్‌కుమార్, చీపురుపల్లి విజయలక్ష్మి, రాజు, కిషోర్ పాల్గొన్నారు.

నాటు తుపాకీకి జింక బలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ సమీపన గల కొండల వద్ద గురువారం మృతి చెందిన జింక గ్రామస్తుల కంటపడింది. ఇది వేటగాళ్ల పనేనని స్థానికులు భావి స్తున్నారు. విషయం తెలుసు కున్న పాలకొండ రేంజర్ రామారావు, స్థానిక డిఆర్ఒ పి.రవిబాబు జింకను పరిశీలించి పోస్టుమార్టం కోసం స్థానిక పశు వైద్య కేంద్రానికి తరలించారు. నాటు తుపాకీ వల్లే జింక మృతి చెందిందని ప్రాథమిక విచారణలో వైద్యాధికారి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వి.కళావతి మృతి చెందిన జింకను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వండవ- తూడి గ్రామాల్లో ఆనుకుని ఉన్న కొండల్లో అరుదైన చుక్కల జింకలు, దుప్పులు, తదితర రకాలైన జంతువులు ఉన్నాయని, వీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.


తుపాకీ తూటాకు బలైన జింక

సమస్యల వలయం.. నారాయణపురం

ప్రజాశక్తి -బలిజిపేట

మండలంలోని నారాయణపురంలో అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు సమస్యలు తాండవిస్తున్నాయని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, సిపిఎం నాయకులు దన్నాన త్రినాధ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు గ్రామంలో గురువారం పర్యటించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో చెత్తపేరుకుపోవడంతో రోడ్లపై వెళ్తుంటే కంపు కొడుతుందని, కాలువల్లో మురుగు పేరుకుపోయిందని వాపోయారు. పంచాయతీకి నిధులు వస్తున్నా గ్రామాభివృద్ధికి పైసా ఖర్చు పెట్టని పరిస్థితి నెలకొందన్నారు. అలాగే గ్రామాభివృద్ధిని పంచాయతీ సెక్రెటరీ పట్టించుకోవడంలేదని, అయినా సర్పంచులు, వార్డుసభ్యులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. కాలువల్లో చెత్త తొలగించకపోవడంతో ప్రజలు దోమల బారినపడి రోగులకు గురవుతున్నారు. ఒకపక్క ప్రభుత్వం దోమలపై దండయాత్ర చేసి దోమలు లేని గ్రామాన్ని ఆరోగ్యకరమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని చూస్తున్నా ఇక్కడ అందుకు భిన్నంగా ఉందన్నారు. తక్షణమే కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను తొలగించాలి, నీటి కుళాయిలకు ట్యాపులు బిగించాలి గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు యమ్మల మన్మధరావు, వెంకట్రావు నాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి : సిపిఎం


పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

టిడిపిలో వైసిపి ఎంపిటిసి చేరిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం బిజె పురం వైసిపి ఎంపిటిసి సభ్యులు నాగవరపు మల్లేశ్వరి టిడిపిలో చేరారు. గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో గురువారం కురుపాం ఎమ్మెల్యే టి.జగదీశ్వరి కండువా కప్పి మల్లేశ్వరిని టిడిపిలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జియమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, మండల టిడిపి అధ్యక్షులు పల్ల రాంబాబు, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, టిడిపి అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకష్ణ ఉన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జిల్లాలో మొక్కజొన్న సాగు చేసే రైతులు పెరిగి ఈ ఏడాది పంట చేతికి అందినా ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారని వెంటనే ప్రభుత్వం జిల్లాలో అన్ని మండలాల్లోనూ మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఎపి రైతు సంఘం ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా రెవెన్యూ అధికారి హేమలతను ఆమె కార్యాలయం కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పండించిన పంట అమ్ముకోలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారని అన్నారు. అనేక చీడపీడలకు తట్టుకొని మొక్కజొన్న పంటను పండించిన రైతు మార్కెట్ సదుపాయం లేక దిగాలు పడుతున్నారని, ఈ ఏడాది రబీ సీజన్ వరి పంట చేతికి అందొస్తున్న తరుణంలో మద్దతు ధరకు ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభించి కొనుగోలు చేయాలని కోరారు. జిల్లాలో పేద రైతులను ప్రభుత్వం సకాలంలో ఆదుకోవాలని లేకపోతే పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం ఉపాధ్యక్షులు రెడ్డి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌డిఒకు వినతి పత్రాన్నిస్తున్న రైతు సంఘం నాయకులు

13న మెగా వాలీబాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధోనుబాయి పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ధోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి 15 వరకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు టీంలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.